

# 8. అసలు లోపం

**పాఠంలోకి ప్రవేశించేముందు:**



- 'తాబేలు – కుందేలు' పరుగుపందెం కథ మీకు చిన్నప్పటి నుండి తెలిసిందే కదా!
- ఆ కథ ఏయే నీతులను సూచిస్తుంది?

ఇప్పుడు రాము, రాజుల గురించి తెలుసుకుందామా!

రంగయ్య రాజమ్మలకు ఇద్దరు కొడుకులు రాము, రాజు. రాజుకు చిన్నతనంలోనే పోలియో వచ్చింది. అందువల్ల సరిగా నడవలేడు. కర్రల సహాయంతో నడుస్తాడు. రంగయ్య, రాజమ్మలకి రాజు గురించిన దిగులు తప్ప మరే ఇతర కొరత లేదు.

ఒకనాడు రంగయ్య, రాజమ్మ గుడికి వెళ్ళారు. ఆ సమయంలో రాజు మేనమామ శివయ్య వచ్చాడు. రాము మంచం మీద పడుకొని గారెలు తింటూ ఏదో పుస్తకం చదువుతున్నాడు.

శివయ్య సంచి కింద పెడుతూ ''ఏరా రామూ! అమ్మ నాన్న లేరా?'' అన్నాడు.

''లేరు మామయ్య! గుడికి వెళ్ళారు'' అన్నాడు పడుకొనే.

''ఇష్షు'' అంటూ సంచి క్రింద పెట్టాడు. ''కొంచెం మంచి నీళ్లు ఇవ్వు'' అన్నాడు మేనమామ.

''రాజా'' పిలిచాడు రాము.

దొడ్లో కోళ్లకి గింజలు వేస్తున్న రాజు వచ్చాడు. ''ఏమిటన్నయ్యా'' అన్నాడు.

''మామయ్య వచ్చాడు. మంచినీళ్లు తీసుకురా!'' అన్నాడు.

రాజు లోపలికి వెళ్ళి మంచినీళ్లతోపాటు తల్లి చేసి ఉంచిన గారెలు కూడా పళ్లెంలో తెచ్చాడు.

''అత్త ఎలా ఉంది మామయ్య?'' అని అడిగాడు రాజు. బాగుందన్నట్టు తలూపాడు శివయ్య.

''రంగయ్యగారూ'' ఎవరో పిలిచారు. రాజు వెళ్ళాడు. తండ్రి లేడని చెప్పి వారిని విషయం అడిగి పంపాడు.

ఇంతలో ఆవు అరుపు వినిపించింది. వెళ్ళి ఆవుకి గడ్డి వేసి, దూడను వదలి వచ్చాడు.

మంచినీళ్లు రాగా, ట్యూబ్ సహాయంతో తొట్టి నింపసాగాడు.

''ధర్మం బాబూ'' అంటూ ఓపేదవాడు వచ్చాడు. రాజు గుప్పెడు బియ్యం తెచ్చి ఆ వృద్ధుడికి వేశాడు. పక్కింటి రామనాథం పేపరుకై రాగా ఇచ్చి పంపాడు.

కూరగాయలు, చాకు, ఒక పళ్ళెంలో తీసుకొని మేనమామ వద్దకు వచ్చి చంకలోని కట్టెలు పక్కనపెట్టి కూర్చుని కుశల ప్రశ్నలడుగుతూ, కూరలు తరగసాగాడు తల్లికి సాయం అవుతుందనే ఉద్దేశ్యంతో.

ఇంతలో తల్లి, తండ్రి గుడినుంచి వచ్చారు. అన్నని చూసి రాజమ్మ మొహం వికసించింది.

''ఎప్పుడొచ్చావు అన్నయ్యా? ఎలా ఉన్నారు?'' అంది. ''అంతా బాగే. మీరెలా ఉన్నారు?'' అన్నాడు కుశలం అడుగుతూ శివయ్య.

''అంతా బాగానే వున్నాం. పిల్లవాని గురించిన దిగులుతప్ప'' అంది విచారంగా.

''ఏమయ్యింది రాముకి'' అన్నాడు శివయ్య.

"రాముకేమీ కాలేదు. నా దిగులంతా రాజు గురించే" అంది.

"ఏం రాజుకేమయ్యింది?" అన్నాడు.

"ఏమిటన్నయ్యా అలా అడుగుతావు. కళ్ళముందర వాడి కొరత చూస్తూ కూడా" అంది నిష్ఠూరంగా రాజమ్మ.

"నాకేం అలా అనిపించటం లేదే. నేను వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. వాడు అన్ని పనులూ మనలాగే, ఇంకా చెప్పాలంటే మనకంటే బాగా చేస్తున్నాడు. నువ్వు దిగులు పడాల్సింది రాము గురించే."

"ఏం రాముకేమయ్యింది" అంది ఆశ్చర్యంగా, వాడికేం లోటు?"

"మనిషికేమీ లేదు లోటు. కానీ వాడి అసలు కొరతల్లా మనస్సుది. నేను వచ్చినప్పటినుంచీ మంచం పట్టిన రోగిలా లేవకుండా, రాము ఒక్కడే కష్టపడి అన్ని పనులూ చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా, దయలేకుండా, చుట్టాన్ని, పెద్దవాడిని అయిన నన్ను ఏమాత్రం గౌరవించకుండా సరిగ్గా పలుకరించకుండా, దేవుడిచ్చిన అవయవాలను ఉపయోగించుకోకుండా అలా పడుకునే ఉన్నాడు. కానీ రాజు అలా కాదు. తన లోపాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా అన్ని పనులూ చేస్తున్నాడు. అంతేకాదు. వాడిలో భూతదయ, కార్యశక్తి, సహాయగుణం, బంధుప్రీతి ఇవన్నీ ఉన్నాయి. అందువల్ల రాములోనే అసలైన లోపం ఉంది. కాబట్టి వాడి గురించి జాలిపడు, చేతనయితేమార్చు." అన్నాడు శివయ్య.

శివయ్య మాటలలోని సత్యాన్ని రంగయ్య, రాజమ్మలు గ్రహించారు. కర్తవ్యాన్ని తెలుసుకున్నారు.

---

## I. వినండి–సంభాషించండి.

1. లోపం– అంటే ఏమిటి ?
2. మనిషి ఏయే సందర్భాలలో కర్రల సాయంతో నడుస్తాడు ?
3. కృత్రిమ కాళ్ళతో నాట్యం చేసి పేరు పొందిన సుధా చంద్రన్ గూర్చి మిత్రులతో సంభాషించండి.

## II. చదవండి–ఆలోచించండి–రాయండి.


### అ. పదజాలం పెంపొందించుకుందాం.

కొరత = తక్కువ; కుశలం = క్షేమం; లోటు = తక్కువ; భూతదయ = ప్రాణుల పట్ల దయ; ప్రీతి = ఇష్టము.

### ఆ. చర్చించండి–రాయండి.


1. శివయ్య రాముని ప్రశ్నించిన విధం.
2. రాజు కూరలు తరగడానికి కారణం.
3. రాజు మేనమామకు అతిథి మర్యాదలు చేసిన విధం.
4. శివయ్య తన చెల్లెలితో దిగులుపడాల్సింది రాము గురించే అనడానికి కారణం.
5. రాజు కర్రల సహాయంతో నడుస్తూ పనులు చేయటానికి కారణం.

### ఇ. ఎవరు, ఎవరితో అన్నారు.



**III. కృత్యం:**

**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు రాయండి.**




"మనిషికేమీ లేదు లోటు........ ....... కర్తవ్యాన్ని తెలుకున్నారు" వరకు




**ఆ. కింది పదాలకు వాచకాలు రాయండి.**

1) రాము ______ 2) మామయ్య ______

3) రాజమ్మ ______ 4) ఆవు ______

**ఇ. స్వీయవ్యక్తీకరణ:**

రాములో లోపం ఉందని శివయ్య చెప్పటం ఎంత వరకు సరియైనది- మీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయండి.

## IV. భాషావగాహన

**అ. గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించండి.**

1. నేను వచ్చినప్పటి నుంచి మంచం పట్టిన రోగిలా లేవకుండా ఉన్నాడు.
2. వాడు అన్ని పనులు మనకంటే బాగా చేస్తున్నాడు

**ఆ. గుర్తించిన ప్రత్యయాలకు విభక్తులు రాయండి.**

1. రామనాథం పేపర్కై వచ్చాడు. – ______
2. రాజు దూడను వదిలాడు. – ______
3. నువ్వు రాజు గురించి దిగులు పడాలి. – ______
4. మంచి నీళ్ళతో గారెలు కూడా తెచ్చాడు. – ______
5. రాజులో భూతదయ, కార్యశక్తి ఉన్నాయి. – ______

## V. సృజనాత్మకత:

1. ఏయే వ్యాధులు సంక్రమించడంవల్ల అవయవాలు పనిచేయవు- అంతర్జాలం ద్వారా సమాచారం సేకరించండి.
2. పోలియో వ్యాధి నిర్మూలనకై ప్రభుత్వం ఎటువంటి జాగ్రత్తలను తీసుకుంటున్నది?
3. పోలియో వ్యాధి నిర్మూలనకై, జనజాగృతికై ఎటువంటి చర్యలు చేపట్టవచ్చో ఫ్ల కార్డుల (కర్రతో గూడిన ఫలకం) ద్వారా ప్రదర్శించండి.

- **భాషాకౌశల్యాలు – మౌఖికం; శ్రవణం, ఉక్త లేఖనం**

1. కుశల ప్రశ్నలు
2. కర్తవ్యం
3. కార్యశక్తి
4. కూరగాయలు

- **కింది పదాలకు అర్థాలను రాసి, 'నా నిఘంటువు'ను తయారుచేయండి. ('అ'కారాది క్రమంలో)**

ఆంగ్లం, ఖాయం, ఆసక్తి, అభినందించుట, మేధావి, ఆదేశించుట, దర్పము, హానము, మన్నించుట, నిర్లక్ష్యం, ఉల్లంఘించుట, ఆందోళన, ఆత్రుత, తాపత్రయం, కృతజ్ఞతలు, సంక్షిప్తం, సమాచారం, పరిభ్రమించుట, ఘనత, ప్రగతి, సునాయసం, వెలికి, అబ్బురపరచుట, ప్రశంస, తరుణం.

| | | |
|---|---|---|
| అబ్బురపరచుట = ఆశ్చర్యపరచుట | ఖ | మ |
| అభినందించుట = ప్రశంసించుట | ఘ | వ |
| ఆంగ్లం = ఇంగ్లీషు | త | స |
| ఆ | ద | హ |
| ఉ | న | |
| క | ప | |

## భాషాకౌశల్యాలు (మౌఖికం) – స్వీయ అనుభవం

ఏదైనా ప్రదేశం, ఉత్సవం, సంఘటన మొదలగు వాటిని చూచినపుడు ఒక విధమైన అనుభూతిని పొందడం సహజం. దీనినే స్వీయ అనుభవం అంటారు. దానిని గూర్చి స్పష్టంగా ఆత్మవిశ్వాసంతో చెప్పగలగడం, ఒక నేర్పు. ఇది జీవితంలో ఎంతో ఉపయోగపడుతుంది.



ఇప్పుడు లక్ష్మి ముంబయిలో పాల్గొన్న బతుకమ్మ సంబరాల గురించి తన స్వీయ అనుభవాన్ని అంశాల ఆధారంగా ఏవిధంగా రాసిందో చూద్దామా!

**అంశాలు :**

- **సొంత ఊరిలో బతుకమ్మ సంబరాల జ్ఞాపకాలు.**
- **ముంబయిలో బతుకమ్మలాడే అవకాశం.**
- **తద్వారా కలిగిన స్వీయ అనుభవాలు...**

దేశంలో ఉన్నపుడు బతుకమ్మ పండగొస్తే సంబురమే సంబురం. ఆ పదిరోజులు ఎట్లాబోయేవో తెలుసేవేగాదు. బొడ్డెమ్మలు, బతుకమ్మలు గల్లీగల్లీలో ఆడేవాళ్ళం. పగటిపూట పూలు తెంపకరావడం, సాయంత్రంయాల ఇగ బతకమ్మను పేర్చుడు, ఆడుడూ, పాడుడూ ఒకటే సందడి.


ముంబై వచ్చినాంక దాదాపు ఫుల్‌స్టాప్ అయిపోయింది. ఈడసోటూ లేదూ, మా ఇంటి కాడ బతుకమ్మ ఆడే దోస్తులూ లేరు. కానీ రెండేళ్ళ కిందట కామ్‌గార్ స్టేడియంలో బతుకమ్మలు ఆడుతున్నారని తెలిసి దొరికిన పూలతో మాయమ్మ, నేను, మా సెల్లి బతుకమ్మలు పేర్చి అందరితో పాటు బతుకమ్మల నెత్తుకొని ఊరేగింపులో కలిసి కామ్‌గార్ స్టేడియం చేరినాం. మస్తుసేపు బతుకమ్మలను ఆడుకున్నాం. పాటలు పాడుకున్నాం. కామ్‌గార్ స్టేడియంలో ఎటుచూసినా బతుకమ్మలే. ఎటుచూసినా తెలుగోల్లే. మస్తుగనిపించింది. ఆ సంప్రదాయ వేషధారణ, తెలుగు నుడికారం చూస్తే అబ్బో హైదరాబాదు యాదికొచ్చింది.

**అభ్యాసం:**

కింది అంశాల ఆధారంగా నీవు చూచిన 'వైజ్ఞానిక ప్రదర్శన'ను గూర్చి నీ స్వీయ అనుభవమును రాయి.

**అంశాలు:**

- **చూచిన వైజ్ఞానిక ప్రదర్శన**
- **తరగతి పిల్లలతో కలిసి సందర్శించుట.**
- **ప్రదర్శన వలన కలుగు లాభములు**
- **ప్రదర్శన ద్వారా నీకు కలిగిన స్వీయ అనుభవము.**




- వివిధ రంగాల్లో రాణించిన దివ్యాంగుల వివరాలను అంతర్జాలం ద్వారా సేకరించండి.